క్లుప్తంగా

సత్తెమ్మతల్లికి సారె సమర్పణ

గాజువాక : గాజువాక రాజీవ్‌మార్గ్‌లోని సత్తెమ్మ తల్లి పండగ మహోత్సవాల్లో భాగంగా భక్తులు అమ్మవారికి సారె సమర్పించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 108 రకాల పిండి వంటలతో కూడిన సారెను భక్తులు అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు కోలాటంతో సందడి చేశారు. పండగ కార్యక్రమాల్లో భాగంగా అమ్మవారి ఘటాలను ఊరేగించారు. 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో 76వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దొడ్డి రమణ, ఉత్సవ కమిటీ చైర్మన్ సూరిశెట్టి శివ, ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ సభ్యులు శరగడం కోటి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శిగా నాగేశ్వరరావు


ఎం.వి.నాగేశ్వరరావు

అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శిగా పరవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్, లంకెలపాలేనికి చెందిన ఎం.వి.నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి వెంకట లక్ష్మమ్మ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు పనిచేసిన ఎ.శేఖర్‌కు ప్రధానోపాధ్యాయునిగా పదోన్నతి రావడంతో ఆయన స్థానంలో నాగేశ్వరరావును నియమించారు. ఆయన రెండేళ్ల పాటు ఈ పదవిలో ఉంటారు. నాగేశ్వరరావుకు పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.గోపీనాథ్, సీహెచ్.పెద్దినాయుడు, లంకెలపాలెం హైస్కూల్ హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు.

రోడ్డుపైనే వర్షపు నీరు



వడ్లపూడి జంక్షన్ వద్ద నిలిచిన నీరు

కూర్మన్నపాలెం: శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి వడ్లపూడి జంక్షన్ వద్ద ప్రధాన రహదారిపై వర్షపు నీరు రోడ్లపైనే నిలిచిపోయింది. దీంతో ఆ దారిలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బంది పడ్డారు. కొద్దిసేపు ట్రాఫిక్‌జామ్ అయింది. చిన్న వర్షం కురిసినా వడ్లపూడి జంక్షన్ వద్ద నీరు నిలిచిపోతోంది. దీంతో వాహనదారులు ఆ ప్రాంతంలో తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడా మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

కోస్ట్‌గార్డ్ షిప్ సముద్ర పహెరేదార్ సందర్శన


షిప్‌ను సందర్శిస్తున్న జర్నలిస్టులు

సింధియా: జర్నలిస్టుల కోసం రక్షణ మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న మూడు వారాల డిఫెన్స్ కరెస్పాండెన్స్ కోర్సులో భాగంగా శనివారం విశాఖపట్నంలోని కోస్ట్‌గార్డ్ షిప్ సముద్ర పహెరేదార్‌ను సందర్శించారు. సందర్శనకు వచ్చిన జర్నలిస్టులకు షిప్ చార్టర్, సంస్థాగత నిర్మాణం .. దాని బాధ్యతలతో పాటు సముద్ర సవాళ్లను పరిష్కరించడంతో షిప్ యొక్క సామర్థ్యాన్ని వివరించారు.

ఏకదంతాయ.. వక్రతుండాయ..

- నవరాత్రి ఉత్సవాలకు సిద్ధమవుతున్న గణనాథుని విగ్రహాలు
- తయారీలో నిమగ్నమైన కళాకారులు


మత్స్యంపై మూషికవాహనుడు


పక్షిపై పార్వతీ తనయుడు


ఏడు ముఖాలతో..

పెదగంట్యాడ: వినాయక చవితి సమీపిస్తుండటంతో గణనాథుడి విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. గృహాల్లో పూజలందుకునే బుజ్జి గణనాథుడి ప్రతిమ నుంచి వీధుల్లో కొలువుదీరే భారీ గణేశుడి వరకు వివిధ ఆకృతుల్లో రూపుదిద్దుకుంటున్నాయి. గణపతి నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను కమిటీలు పర్యవేక్షిస్తుండగా మరోవైపు విగ్రహాల రూపకల్పనలో కళాకారులు నిమగ్నమయ్యారు. పెదగంట్యాడ మండలంలోని హౌసింగ్ బోర్డు కాలనీ, సమతానగర్, దయాల్‌నగర్ ప్రాంతాల్లో విగ్రహాలు తయారుచేస్తున్నాయి. పండగకు కొద్ది రోజులు మాత్రమే ఉండడంతో కళాకారులు రేయింబవళ్లు పని చేస్తున్నారు.

తయారీ ఇలా..

వినాయకుడి విగ్రహాలను విభిన్న రూపాల్లో తయారు చేస్తున్న కళాకారులు దానికి అవసరమైన సరంజామాను సిద్ధం చేసుకుంటున్నారు. ముందుగా కర్రలు, గడ్డితో ఒక ఆకృతిని కల్పించిన అనంతరం మట్టిని మెత్తి, రూపం తీసుకువస్తున్నారు. దీనికి అవసరమైన బంక మట్టిని కోల్‌కతా నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. విగ్రహాలను పూర్తి స్థాయిలో తీర్చిదిద్దిన అనంతరం వాటికి రంగులు వేస్తున్నారు.

రూ.3 వేల నుంచి రూ.లక్ష వరకు ధర

ఇక్కడ తయారు చేస్తున్న విగ్రహాలు రూ.3 వేల నుంచి రూ.లక్ష వరకు విలువ చేసేవి ఉన్నాయి. చిన్న ప్రతిమలకు రూ.3 వేలు, పెద్ద విగ్రహాలకు 30 వేల నుంచి లక్ష రూపాయల వరకు తీసుకుంటున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఉత్సవ కమిటీల ప్రతినిధులు వారికి కావాల్సిన విగ్రహాలను అడ్వాన్సులు ఇస్తున్నారు. ఆ విగ్రహాలకు నంబర్లు వేయించుకుంటున్నారు.


రంగులద్దుకుంటున్న గణనాథులు

ఆర్డర్ల ప్రకారం తయారీ

కొంతమంది తమకు కావాల్సిన రీతిలో విగ్రహాల తయారీకి ఆర్డర్ ఇస్తున్నారు. ఆకృతి, పరిమాణం, రంగులు తదితరాలన్నీ వారి అభిరుచికి అనుగుణంగా తయారీదారులకు సూచనలిచ్చి చేయించుకుంటున్నారు.

విభిన్న రూపాలు

గజముఖుడిని విభిన్న రూపాల్లో ముచ్చటగా తయారు చేస్తున్నారు. సింహాసనంపై కొలువుదీరినట్లుగా.. పార్వతీ పరమేశ్వరుల మధ్య బాల గణేశుడిగా.. నెలవంకపై పడుకున్నట్లుగా.. శ్రీకృష్ణుని అవతారంలో.. వేంకటేశ్వరస్వామి రూపంలో.. త్రిముఖం.. పంచముఖాలతో దర్శనమిచ్చేలా తీర్చిదిద్దుతున్నారు.

కోల్‌కతా నుంచి వచ్చి..

25 ఏళ్ల క్రితం కోల్‌కతా నుంచి పదుల సంఖ్యలో వచ్చిన కళాకారుల కుటుంబాలు ఇక్కడ స్థిరపడిపోయాయి. గుడారాలు వేసుకుని అక్కడే వినాయక ప్రతిమలు తయారు చేస్తున్నారు. ఏటా వినాయక చవితితో పాటు దసరాకు దుర్గాదేవి, విశ్వకర్మ పూజల కోసం ఇక్కడ విగ్రహాలను తయారు చేస్తున్నారు. కృష్ణాష్టమికి అవసరమైన శ్రీకృష్ణుని బొమ్మలను కూడా తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నారు.

యూనియన్లకు గుర్తుల కేటాయింపు

అక్కిరెడ్డిపాలెం: భెల్‌లో ఈ నెల 31న జరగనున్న గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో పోటీలో నిలిచిన యూనియన్లకు గుర్తులు కేటాయించారు. రీజనల్ లేబర్ కమిషనర్ కె.జగన్నాథ్ మహంతి శనివారం వీటిని ప్రకటించారు. ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ పొత్తుతో పోటీలో నిలిచిన ప్రోగ్రెసివ్ ఫ్రంట్‌కు ఉదయించే సూర్యుడు గుర్తును, యునైటెడ్ ఫ్రంట్‌కు సింహం గుర్తును ప్రకటించినట్లు తెలియజేశారు. బీఎంఎస్ కూడా పోటీలో ఉందని ఆ యూనియన్ ప్రతినిధులు తెలిపారు.

నేడు సమావేశాలు

ఎన్నికలు సమీపించడంతో యూనియన్లు ఆదివారం సమావేశాలు నిర్వహిస్తున్నాయి. ప్రోగ్రెసివ్ ఫ్రంట్ ఉదయం 11 గంటలకు గుర్తింపు యూనియన్ కార్యాలయంలో సమావేశం కానుంది. ఆయా యూనియన్ల భాగస్వామ్య పార్టీల నాయకులు పాల్గొంటారు. యునైటెడ్ ఫ్రంట్ (ఏఐటీయూసీ) కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం మిండి గుడివాడ అప్పన్న కల్యాణమండపంలో ఆదివారం ఉదయం 10 గంటలకు జరపనున్నట్లు ఫ్రంట్ ప్రతినిధులు తెలిపారు.

‘ఉక్కు’ ప్రైవేటీకరణపై కేంద్రం పునరాలోచించాలి


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయాన్ని కార్మికుల భవిష్యత్తు కోసం పునరాలోచించాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి 926వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సంస్థకు చెందిన ఆర్ అండ్ డీ, టెలికాం, ఈటీఎల్ విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని కోరారు. లేని పక్షంలో బీజేపీకి వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవని హెచ్చరించారు. భారత రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ ప్రధాని మోదీ తన నిరంకుశత్వ పాలనతో అన్యాయంగా విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. దేశంలో సంపద సృష్టించలేని బీజేపీ ప్రభుత్వానికి దేశ సొత్తు అయిన ప్రభుత్వరంగ సంస్థలను అమ్మే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ప్లాంటును పూర్తి స్థాయి ఉత్పత్తి దిశగా నడపవలసిన యాజమాన్యం కావాలనే నష్టాల వైపు నెట్టే ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఇకనైనా కుటిల రాజకీయాలను వదిలి, స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి ఉత్పత్తి దిశగా నడపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఉక్కు కార్మిక నాయకుడికి సత్కారం

ఉక్కునగరం: స్టీల్ టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి విళ్లా రామ్మోహన్ కుమార్‌ను అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు సత్కరించారు. రామ్మోహన్‌కుమార్ ఈ నెలాఖరున పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా శనివారం ఉదయం సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద జరిగిన కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు ఆయనకు పూలమాలలు వేసి అభినందించారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు జె.అయోధ్యరామ్, యు. రామస్వామి, నీరుకొండ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

28న స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశం

వ్యాయామ ఉపాధ్యాయులకు
ఇక ప్రతీ నెల సమావేశాలు

అగనంపూడి: వ్యాయామ ఉపాధ్యాయులకు ఈ నెల నుంచి స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించనున్నట్లు అనకాపల్లి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు తెలిపారు. మిగిలిన సబ్జెక్టుల మాదిరిగానే ఇకపై వ్యాయామ అక్షరాస్యత (ఫిజికల్ లిటరసీ) సబ్జెక్టుకు కూడా ప్రతీ నెలా సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. లంకెలపాలెంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ పర్యవేక్షణలో ఈ నెల 28న జిల్లాలోని 7 నియోజకవర్గాల స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. పెందుర్తి నియోజకవర్గానికి సంబంధించి పరవాడ, సబ్బవరం, పెందుర్తి మండలాల వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నామని తెలిపారు. వ్యాయామ విద్య పురోభివృద్ధి, క్రీడా పోటీలు, క్రీడా నిబంధనల్లో వస్తున్న మార్పులపై ఈ సమావేశంలో చర్చిస్తామని వివరించారు.

మానవతామూర్తి మదర్ థెరిసా

- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- జయంతి సందర్భంగా ఘన నివాళులు


మదర్ థెరిసా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు


మదర్ థెరిసాకు నివాళులర్పిస్తున్న అగనంపూడి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి

పెదగంట్యాడ: మానవ సేవే మాధవ సేవగా భావించి, కుష్టు రోగులను సైతం అక్కున చేర్చుకున్న మానవతామూర్తి మదర్ థెరిసా అని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఆమె సేవలు మరువలేమన్నారు. మదర్ థెరిసా జయంతిని పురస్కరించుకుని స్థానిక బీసీ రోడ్డులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, గొందేశి వెంకట రమణారెడ్డి, మహేశ్వరరెడ్డి, సంపంగి ఈశ్వరరావు, సుమన్ రెడ్డి, వెంకటేష్, బొడ్డ గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రేమనిధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

ఇటలీ దేశంలో పుట్టి భారతదేశంలో సేవలు అందించిన మదర్ థెరిసా సేవలు చిరస్మరణీయమని 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవింద్ అన్నారు. ప్రేమనిధి ఫౌండేషన్ చైర్మన్ అంజూరి దీపక్ ఆధ్వర్యంలో పెదగంట్యాడ కూడలిలో మదర్ థెరిసా జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పులి వెంకటరమణారెడ్డి, మహేశ్వరరెడ్డి, కోన చిన అప్పారావు మంత్రి శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

➡ మదర్ థెరిసా జయంతిని జీవీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గంట్యాడ గోవిందరాజు ఎస్సీ కాంప్లెక్స్ వద్ద నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గంట్యాడ పైడిరాజు, కాకినాడ అప్పారావు, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీసేవా సంఘం ఆధ్వర్యంలో..

అగనంపూడి: మహాత్మాగాంధీసేవా సంఘం ఆధ్వర్యంలో 79వ వార్డు పాత అగనంపూడి సత్రం కూడలిలో మదర్‌థెరిసా జయంతిని నిర్వహించారు. మదర్ థెరిసా చిత్రపటానికి అగనంపూడి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ వేచలపు రామారావు, సేవా సంఘం అధ్యక్షుడు చిత్తా రామారావు, ప్రతినిధులు మెడికల్ నాగేశ్వరరావు, రాజు, ముత్యాల అప్పారావు, సురేష్, లయన్స్‌క్లబ్ కార్యదర్శి ఆదారి వెంకట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

➡ అగనంపూడి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అగనంపూడి ఆస్పత్రి ఆవరణలో మదర్ థెరిసా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి, నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు ఎం.మస్తాన్‌రెడ్డి, ఎ.వెంకటకృష్ణ, గుదే సుశీలా గజేంద్రరావు, గురు గోవింద్, ఎం.చిన్నారావు పాల్గొన్నారు.

శివాలయంలో విగ్రహాల పునఃప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం


విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో పాల్గొన్న జీవీఎల్ తదితరులు

గాజువాక : జీవీఎంసీ 71వ వార్డు వడ్లపూడి రైల్వే క్వార్టర్స్‌లోని శివాలయంలో విగ్రహాల పునఃప్రతిష్ఠాపనోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రతిష్ఠించనున్న శివలింగం, వారాహి అమ్మవారు, పార్వతిదేవి, గణపతి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. దేవతామూర్తుల విగ్రహాలకు బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు దంపతులతో పాటు రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావు పూజలు చేశారు. కలశ ప్రతిష్ఠతో పాటు విగ్రహాలను ఆదివారం ప్రతిష్ఠించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో దలాయ్, రమణారావు, అప్పారావు, కరణం వెంకటరావు, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దు

డాక్టర్ రంజిత్


పరవాడ పీహెచ్‌సీలో నేత్రదాన పక్షోత్సవాల పోస్టర్ ప్రదర్శిస్తున్న వైద్య సిబ్బంది

పరవాడ: కంటి సంరక్షణ విషయంలో ప్రతీ ఒక్కరు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పరవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఐ.ఆర్.రంజిత్ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అనకాపల్లి జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రతినిధులు ఆర్.రమణ కుమార్, ఆప్తాలమిక్ అధికారి ఆర్.వెంకట్రావు ఆధ్వర్యంలో నేత్రదాన పక్షోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యుడు ఐ.ఆర్.రంజిత్ మాట్లాడుతూ పౌష్టికాహార లోపం, ఇన్ఫెక్షన్లు, కెమికల్‌బర్న్స్, పుట్టుకతో వచ్చే లోపాలు, గాయాల కారణంగా కంటి చూపు పోగొట్టుకున్న వారికి నేత్రదానం చాలా అవసరమన్నారు. మనిషి మరణాంతరం 6 గంటల వ్యవధిలో కంటిలోని కార్నియా తీసి కంటిచూపు లోపించిన వ్యక్తికి అమర్చడం ద్వారా కంటి చూపును ప్రసాదించవచ్చునన్నారు. అన్ని దానాల్లో కన్నా నేత్రదానం గొప్పదన్నారు. ఎవరైనా మరణించినపుడు వారు నేత్రదానం చేసే విధంగా ఆ కుటుంబానికి అవగాహన కల్పించాలన్నారు. నేత్రదానం చేసే వారు ముందుగా నగరంలోని ఐ బ్యాంకులకు సమాచారం అందించాలని డాక్టర్ రంజిత్ సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ హారిక, సీహెచ్‌వో ఎం.ఎస్.ఎస్.సాయిరామ్, పీహెచ్ ఎన్. జానకీ రామన్, యూడీసీ ఆనందకుమార్, సిబ్బంది రాజేశ్వరి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

కొనసాగిన వాహనాల తనిఖీ

గోపాలపట్నం: కార్లకు గౌట్ డ్యూటీ, రవాణా శాఖ... ప్రొటోకాల్ వెహికల్ వంటి ప్రత్యేక బోర్డులపై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పలు వాహనాలను నిలిపి ఆయా బోర్డులు ఎందుకు పెట్టారు..., ఏవిధమైన అనుమతులు ఉన్నాయో ఆరా తీశారు. అనుమతులు లేని వాహనాల నుంచి ఆయా బోర్డులను తొలగించారు. హైసెక్యూరిటీ నంబర్ బోర్డులు కాకుండా డిజైన్ చేసిన నంబర్ బోర్డులను కూడా తొలగించారు. వీటిపై కేసులు నమోదు చేశారు. కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు ఆదేశాల మేరకు ట్రాఫిక్ సిబ్బంది ఈ తనిఖీలు చేపట్టారు.

రెండో రోజుకు జనజాగరణ దీక్షలు


జనజాగరణ దీక్షలో పాల్గొన్న ఎన్‌సీఈ యూనియన్ సభ్యులు

సింధియా: డిఫెన్స్ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో తూర్పు నావికాదళంలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలపై చేపట్టిన రెండు దీక్షల్లో భాగంగా నౌకాదళ ప్రధాన కార్యాలయం ఎదుట శనివారం వంటావార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఫెన్స్ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరావు మాట్లాడుతూ కమాండ్ పరిధిలోని దీర్ఘకాలిక సమస్యలైన వైద్య సదుపాయాలు, హెచ్ఆర్ఏ పెంపు, ఇంక్రిమెంట్లు, వేతన సవరణ వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమానికి వివిధ ట్రేడ్ యూనియన్ల నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీఈ యూనియన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మారుతి, పి.నాగేశ్వరరావు, ఇతర యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో మారణకాండపై నిరసన ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న నవజ్యోతి మహిళా సంఘం ప్రతినిధులు

మల్కాపురం: మణిపూర్‌లో మహిళలపై జరిగిన మారణకాండను నిరసిస్తూ స్థానిక నవజ్యోతి పరస్పర సహాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో 61వ వార్డు మల్కాపురంలో శనివారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీని నవజ్యోతి మాక్స్ డైరెక్టర్ సంగీత ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ భారత స్త్రీని ఇతర దేశాల వారు ఎంతో గౌరవిస్తుంటే.. మన దేశంలోని మణిపూర్ రాష్ట్రంలో అదే స్త్రీలను నగ్నంగా ఊరేగిస్తున్నారని ఆవేదన చెందారు.ఇలాంటి సంఘటను చూస్తుంటే మనం ఏ నాగరికతలో ఉన్నామనే బాధ కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించిన నాడే మహిళలకు న్యాయం జరుగుతుందన్నారు. సంఘం ప్రతినిధులు,సభ్యులు పాల్గొన్నారు.

100 శాతం జీఈఆర్ సాధించాలి

- సచివాలయ ఎడ్యుకేషన్ కార్యదర్శులకు డీఈవో చంద్రకళ ఆదేశం


బోరవానిపాలెం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

ఆరిలోవ: సచివాలయాల ఎడ్యుకేషన్ కార్యదర్శులు గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జీఈఆర్–స్థూల ప్రవేశాల నిష్పత్తి) సర్వే 100 శాతం జరపాలని డీఈవో ఎల్. చంద్రకళ తెలిపారు. జీవీఎంసీ జోన్–2 పరిధి బోరవానిపాలెం, రాజీవ్ గృహకల్ప, జీఎస్‌వో లేఅవుట్, మారికవలస, వాంబేకాలనీ తదితర సచివాలయాలను ఆమె శనివారం సందర్శించి, ఎడ్యుకేషన్ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి క్లస్టర్‌లో జీఈఆర్ 100 శాతం సాధించే విధంగా కృషి చేయాలని సూచించారు. అనంతరం బోరవానిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆమె సందర్శించారు. అక్కడ పాఠశాల పరిస్థితి, గదులు, విద్యార్థుల సంఖ్య, మధ్యాహ్న భోజనం, పూర్తయిన సిలబస్ తదితర అంశాలను పరిశీలించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులను పలకరించారు. వారి వర్క్‌బుక్స్ పరిశీలించారు. క్రమశిక్షణతో చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు.

టైం అడిగి సెల్‌ఫోన్ లాక్కొని పరారీ

గోపాలపట్నం: ఎన్‌ఏడీ జంక్షన్‌లో పాదచారుడిపై ముగ్గురు వ్యక్తులు దౌర్జన్యం చేసి సెల్‌ఫోన్ లాక్కొనిపోయారు. ఈ ఘటనకు సంబంధించి ఎయిర్‌పోర్టు క్రైం ఎస్‌ఐ కాంతారావు తెలిపిన వివరాలు... శుక్రవారం రాత్రి 3 గంటల సమయంలో దొడ్డి నాయుడుతరుణ్ మురళీనగర్‌లోని ఆక్వా టెక్నాలజీలో విధులు ముగించుకుని వస్తున్నాడు. ఎన్‌ఏడీ జంక్షన్‌లో ద్విచక్ర వాహనంపై వచ్చి టైమ్ అడిగారు. దీంతో సెల్‌ఫోన్ చూసి టైమ్ చెబుతున్న సమయంలో చేతిలో సెల్‌ఫోన్‌ను ఒక్క ఉదుటున లాక్కొని ద్విచక్రవాహనంపై పారి పోయారు. దీంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టారు. నిందితులు గవర జగ్గయ్యపాలేనికి చెందిన ముగ్గురు వ్యక్తులు గుర్రాల రాజ్‌కుమార్, గుమ్మడి పైడిరాజు, నల్లా కార్తీక్‌గా గుర్తించారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించారు. వారి నుంచి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఏటీఎం కార్డు మార్చి టోకరా

సబ్బవరం: ఏటీఎం మిషన్ వద్ద ఏటీఎం కార్డు మార్చి వివిధ ప్రాంతాల్లోని ఏటీఎంల నుంచి రూ.60,500 డ్రా చేసిన సంఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదయ్యింది. ఎస్‌ఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలు.. సబ్బవరం శివారు పెదనాయుడుపాలెం గ్రామానికి చెందిన బోకం ఈశ్వరమ్మ తన భర్త సన్యాసిరావుతో కలిసి ఈ నెల 24న డబ్బులు తీయడానికి సబ్బవరం ఎస్‌బీఐ ఏటీఎం మిషన్ వద్దకు వెళ్లారు. అయితే ఏటీఎం ద్వారా డబ్బులు తీయడం రాకపోవడంతో పక్కనే ఉన్న వ్యక్తికి కార్డు ఇచ్చి పిన్ నెంబర్ చెప్పి డబ్బులు తీసుకుని వెళ్లిపోయారు. వారు ఇంటికి వెళ్లిన తర్వాత వివిధ ఏటీఎంల నుంచి రూ.60,500 డ్రా చేసినట్లు మెసేజ్‌లు వచ్చాయి. దీంతో వెంటనే సబ్బవరం ఎస్‌బీఐ బ్రాంచ్‌కు వెళ్లి జరిగిన విషయం చెప్పారు. దీంతో బ్యాంకు అధికారులు ఏటీఎం కార్డు మారిపోయినట్లు గుర్తించి విషయం దంపతులకు తెలిపారు. మోసం జరిగినట్లు గుర్తించి బ్యాంకు సిబ్బంది స్టేట్‌మెంట్ తీయగా రాంపురం,విశాలాక్షినగర్, దొర ఫిల్లింగ్ స్టేషన్ వంటి పలు ఏటీఎంల నుండి అదే రోజు రూ.60,500 డ్రా చేసినట్లు స్టేట్‌మెంట్‌లో వచ్చిందన్నారు. దీనితో బ్యాంకు అధికారులు అకౌంట్‌ను బ్లాక్ చేశారు. బాధితురాలు ఈశ్వరమ్మ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులకు ఏటీఎం కార్డులు ఇవ్వకూడదని సూచించారు.